క్లుప్తంగా

విద్యార్థులకు చెప్పులు పంపిణీ



కొల్లిపర: చింపారెడ్డిపాలెంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సాయిబాబు సహకారంతో శనివారం పాఠశాలలోని 30 మంది పేద విద్యార్థులకు ఎంఈఓ ఎ.లక్ష్మీనారాయణ విద్యార్థులకు చెప్పులు పంపిణీ చేశారు. అనంతరం మజ్జిగ అందజేశారు. హెచ్‌ఎం సాయిబాబు విద్యా బోధనతో పాటు విద్యార్థుల శ్రేయస్సు చూడటం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయుడు పి.జగన్ ఉన్నారు.

ప్రముఖ నృత్య కళాకారిణి డాక్టర్ బాలకు సత్కారం



తెనాలి: తెనాలిలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పెన్షనర్స్ హాలులో ఎన్టీఆర్ నటించిన సినిమాలు, వ్యక్తిత్వం, రాజకీయ జీవితంపై చర్చా వేదిక నిర్వహించారు. కావేటి సామ్రాజ్యమ్మ, పరిమి విజయలక్ష్మి 'బహుజనుల పక్షాన నిలిచిన ఎన్టీఆర్ సినిమాలు' అనే అంశంపై ప్రసంగించారు. వీరితోపాటు ప్రముఖ కళాకారిణి, కూచిపూడి నృత్య గురువు డాక్టర్ చల్లా బాల త్రిపురసుందరిని సత్కరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, అలపర్తి వెంకటేశ్వరరావు, కొండముది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ మందిరంలో మల్లె పూలతో పూజ



తెనాలిటౌన్: బోసు రోడ్డులోని శ్రీ సీతారామ మందిరంలో శనివారం పదహారు రోజుల పండుగ సందర్భంగా స్వామివారికి మల్లెపూలతో పూజలు జరిపారు. స్వామి వారికి విష్ణు సహస్ర నామ పారాయణం అర్చకులు అగ్నిహోత్రం నరసింహామూర్తి నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని పూజలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని మందిరం కమిటీ సభ్యులు అక్కిపెద్ది బాలగోపాల్, కల్లూరి సూర్యనారాయణమూర్తి, రత్నాకర్ శాస్త్రి పర్యవేక్షించారు.

18న స్థలం లీజుకు బహిరంగ వేలం

తెనాలిటౌన్: నందుల పేటలోని బసవ మందిరానికి సంబంధించిన 27 సెంట్ల ఖాళీ సలం లీజుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. మూడేళ్ల కాల పరిమితికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న ఘటన కారుమూరు గ్రామంలో చోటు చేసుకుంది. సెబ్ సీఐ లీనా వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో కారుమూరు గ్రామంలో దాడులు నిర్వహించగా.. గ్రామానికి చెందిన వై. వెంకటేశ్వరమ్మ అనే మహిళ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిందని తెలిపారు. ఆమె నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితురాలిని కోర్టులో హాజరుపరచామని చెప్పారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు

కొల్లూరు: వివాదాన్ని సర్దుమణిచేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడిచేసి, గాయపర్చిన వ్యక్తులపై శనివారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సుగ్గునలంకకు చెందిన సుగ్గున అశోక్, సుగ్గున సాంబశివరావులకు వరిగడ్డి రవాణ చేస్తున్న ట్రాక్టర్లకు చెందిన వ్యక్తులతో గురువారం అర్ధరాత్రి వివాదం జరిగింది. అదే సమయంలో సుగ్గునలంకకే చెందిన దూళిపూడి శ్రీనివాసరావు ఇరు వర్గాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తుండగా.. అశోక్, సాంబశివరావు కర్రలతో దాడి చేశారు. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజీవ్ శామ్యూల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

త్వరపడండి..రాయితీ పొందండి

- గృహ, స్థల ఏడాది పన్ను ఒకేసారి చెల్లిస్తే 5శాతం రాయితీ
- ఈ నెలాఖరు వరకు గడువిచ్చిన ప్రభుత్వం
- తెనాలి పురపాలిక వాసులకు ఊరటనిచ్చే అవకాశం
- ఊపందుకుంటున్న పన్ను చెల్లింపులు

తెనాలి పట్టణ వాసులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గృహ, ఖాళీ స్థలాల ఏడాది పన్ను ఒకేసారి చెల్లిస్తే.. 5శాతం రాయితీ ప్రకటించింది. ఈ నెల 30 వరకు ఇందుకు గడువిచ్చింది. దీంతో యజమానులు పన్ను చెల్లింపును ఇప్పుడిప్పుడే వేగవంతం చేస్తున్నారు.



తెనాలి మున్సిపల్ కార్యాలయం

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘానికి గృహ, ఖాళీ స్థలం పన్నుల ద్వారా ఏడాదికి సుమారు రూ.14.76 కోట్ల ఆదాయం సమకూరుతోంది. పురపాలక సంఘం పరిధిలో సుమారు 35 వేలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. వీటికి ఏడాదికి రెండు సార్లు పన్ను విధించి, వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌కు ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చికి మరోసారి పన్ను వసూలు ఉంటుంది. ఇవి కాకుండా దుకాణాల అద్దె కింద సుమారు రూ.1.70 కోట్ల ఆదాయం సమకూరుతోంది. మొత్తం మీద తెనాలి పురపాలక సంఘానికి ఏడాదికి రూ.16.46 కోట్ల ఆదాయం సమకూరుతోందని లెక్కలు చెబుతున్నాయి.

రాష్ట్రంలో మొదటి స్థానం సాధించిన తెనాలి

తెనాలి పురపాలక సంఘానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌ను ఇచ్చింది. గతేడాది పన్నుల రూపంలో రూ.16 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా మార్చి 31వ తేది నాటికి రూ.14.70కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.1.30 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీనిని బట్టి చూస్తే పన్నుల వసూలులో తెనాలి ముందు వరుసలో ఉందనే చెప్పవచ్చు. గతేడాది పన్నుల వసూలులో రాష్ట్రంలోని సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలలో తెనాలి మొదటి స్థానం సాధించిందని అధికారులు తెలిపారు.

ఐతు శాతం రాయితీకి అవకాశం

పట్టణ పరిధిలో నివశించే వారికి ప్రభుత్వం ఏడాది ప్రారంభంలో శుభవార్త చెప్పింది. ఏప్రిల్ 30 లోపు ఏడాది పన్నును ఒకేసారి చెల్లిస్తే అయిదు శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రటించింది. దీంతో గృహ, స్థల యజమానులు పన్నులు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. తెనాలి పట్టణంలో ఈ పన్నులు రూ.14.76 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.30 కోట్లు వసూలయ్యాయి.

రాయితీని సద్వినియోగం చేసుకోండి



తెనాలి పట్టణ పరిధిలో పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. ఈ నెల 30లోపు ఏడాది పన్నును ఒకే సారి చెల్లిస్తే.. ఐదు శాతం రాయితీ లభిస్తుంది. ఈ అవకాశాన్ని యజమానులు ఉపయోగించుకోవాలి.

–ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

విప్రోలో ఐటీ ఉద్యోగాలకు 92 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్, రామ్‌చంద్

తెనాలి: విప్రో ఐటీ కంపెనీలో ఉద్యోగాలకు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఏకంగా 92 మంది ఎంపికయ్యారు. విప్రో కంపెనీ ఇటీవల వర్చువల్‌గా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులే అత్యధిక సంఖ్యలో ఎంపికవటం గర్వకారణమని ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సంతోషం వ్యక్తం చేశారు. కాలేజీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫైనలియర్ బీఎస్సీ/బీసీఏ విద్యార్థులకు రూ.2.4 లక్షల వేతనం, తొలి నెల జీతానికి అదనంగా రూ.75 వేల బోనస్ లభిస్తుందన్నారు. మూడేళ్లలో వీరి వేతనం రూ.3.4 లక్షలకు పెరుగుతుందని, బిట్స్ పిలానీలో వీరికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ ప్రోగ్రాంను ఉచితంగా చేయిస్తారని వివరించారు. ఐటీ రంగం తీవ్ర మాంద్యం ఎదుర్కొంటున్న తరుణంలో తమ కాలేజి విద్యార్థులు 92 మంది విప్రోలో ఐటీ ఉద్యోగాలను అందుకోవటం గమనించాల్సిన అంశంగా తెలిపారు. జీవన నైపుణ్యాలను పెంచే శిక్షణలో భాగంగా రిఫరెన్స్ గ్లోబ్, ఎడ్యు స్కిల్స్, టెక్స్ బుక్ వంటి వర్చువల్ వేదికలతో ఎంవోయూలను కుదుర్చుకుని, ఐటీ రంగంలోని మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దటమే ఈ విజయానికి కారణమన్నారు. వీరితో కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఉన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



ప్లాస్టిక్ వస్తువులను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించినా.. ఉపయోగించినా చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, గుమ్మడి ప్రసాద్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణ యాజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయించవద్దని సూచించారు. హోటల్, రెస్టారెంట్‌లు, మాంసం, కూరగాయాల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.సుధాకర్, ఎం.సుబ్బారావు, వై.లక్ష్మీనారాయణ, శానిటరీ సెక్రటరీలు ఎ.ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, నగరదీపికలు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవండి



ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్, కన్వీనర్ ప్రభాకర్



బుక్‌లెట్ అందిస్తున్న.. కౌన్సిలర్ సుజాత, నాయకులు



బుక్‌లెట్ అందజేస్తున్న గృహ సారథులు

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ తెనాలి పట్టణ కన్వీనర్ మన్నవ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం కార్యక్రమాన్ని పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో నిర్వహించారు. ఏడోవ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కన్వీనర్ మన్నవ ప్రభాకర్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. అలాగే 13వ వార్డులో కౌన్సిలర్ కుర్రా సుజాత, పార్టీ నాయకుడు కుర్రా శ్రీను, 29వ వార్డులో పార్టీ నాయకులు రమావత్ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఆయా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి బుక్‌లెట్‌లు అందజేశారు. స్టిక్కర్లు అంటించారు.

బాధ్యతలు చేపట్టిన ఒన్‌టౌన్ ఎస్ఐ డేవిడ్



తెనాలిరూరల్: తెనాలి ఒన్‌టౌన్ ఎస్ఐగా వి. డేవిడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన 16 ఏళ్ల ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో పని చేసి, 2005లో సివిల్ విభాగంలోకి మారారు. ఒంగోలు టౌన్, రూరల్, కందుకూరు, వలివేటివారిపాలెం స్టేషన్‌లలో పని చేసి బదిలీపై తెనాలి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ కె. చంద్రోశేఖర్ వద్ద రిపోర్ట్ చేశారు.

ఆటోనగర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు



తెనాలి: రూరల్ మండల పరిధిలోని ఆటోనగర్‌లో ఆరోగ్యం, భద్రత అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో ప్రతినెల 'హెల్త్ ఫిట్‌నెస్ ఫర్ ఆల్' పేరుతో ఆరోగ్య అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆటో నగర్‌లోని వ్యాపారులకు, కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయటమే కాకుండా, ఆరోగ్య భద్రతపై పలు అంశాలను వారికి తెలియజెప్పారు. ఆటోనగర్ అసోసియేషన్ హాలులో ఉదయం నుంచి జరిగిన సదస్సులో మైత్రీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో అందరికీ వైద్య పరీక్షలు చేశారు. అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి భద్రతాపరమైన అంశాలను వివరించారు. తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి శివ మాట్లాడారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు సునీల్ పర్యవేక్షించారు.

మట్టి సారవంతంగా ఉంటేనే దిగుబడి



మట్టి పరీక్షల పై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటరావు

మున్నంగి(కొల్లిపర): మట్టి సారవంతంగా ఉంటేనే దిగుబడి బాగుంటుందని మండల వ్యవసాయ శాఖాధికారి, తెనాలి ఏడీఏ కె.వెంకటరావు అన్నారు. మున్నంగి గ్రామ రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు మట్టి పమూనాల సేకరణపై అవగాహన ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు మట్టి సారవంతం చేయడంపై ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిబ్బందికి రైతు భూమిలో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు అవశ్యకత, సమస్యాత్మక భూములను సరిచేయడం మొదలగు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నియామక పత్రాలు





నతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: డీఎస్సీ 1998 బ్యాచ్‌కు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు తెనాలి మండల పరిధిలోని పలు పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చినట్లు ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం కొత్తపేటలోని విద్యా వనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరిలో సీహెచ్.వెంకట సుబ్రహ్మణ్యం(ఎంపీపీఎస్ కంచర్లపాలెం), కె.రత్నబాబు (ఎంపీపీఎస్ గుడివాడ), కె.కృష్ణ సాయిప్రసాద్ (ఎంపీపీఎస్ అంగలకుదురు), ఎ.శ్రీమన్నారాయణ (ఎంపీపీఎస్ చావావారిపాలెం) ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృతి పట్ల మక్కువతో డీఎస్సీ రాసి పోస్టింగ్‌లు కోసం ఇప్పటి వరకు ఎదురు చూస్తునే ఉన్నామని చెప్పారు. తమకు పోస్టింగ్‌లు ఇచ్చిన సీఎం జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కొల్లిపరలో ఆరుగురికి..

కొల్లిపర: 1998 డీఎస్సీ అర్హత పొందిన ఆరుగురికి ఉపాధ్యాయులుగా శనివారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ ఎం.లక్ష్మీనారాయణ నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధులకు హాజరు కావాలని సూచించారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రమేష్, ఆపరేటర్ వి.ఉషారాణి, అకౌంటెంట్ కె.నాగమల్లీశ్వరి, కార్యాలయం అటెండర్ కె.మాణిక్యం, సీఆర్పీ పి.రమేష్ బాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాల నివారణను వివరిస్తున్న అధికారి కృష్ణారెడ్డి, సిబ్బంది

తెనాలిరూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా, సమయస్పూర్తితో వ్యవహరించాలని తెనాలి అగ్నిమాపక కార్యాలయ సహాయ జిల్లా అధికారి కె.కృష్ణారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై తెనాలి ఆర్టీసీ బస్టాండ్, ఆటోనగర్లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు నివారణ జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపకాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కాల్చి అజాగ్రత్తగా పడేయడం, గ్యాస్ లీకవడం వంటి కారణాలతో ఎక్కువ శాతం అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమందించాలని సూచించారు.

విశ్రాంత ఉన్నతాధికారి మనోహర్ మృతి



వీడీఆర్ మనోహర్ (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన జిల్లా పరిషత్ విశ్రాంత సీఈఓ వీడీఆర్ మనోహర్ (83)వయో భారంతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ మేనేజరుగా, కర్నూలు జిల్లా పరిషత్ సహాయ సీఈఓగా చేసిన మనోహర్, ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓగా పదవీ విరమణ చేశారు. తెనాలిలోని ఉడా కాలనీలో విశ్రాంత జీవనం గడుపుతూ వాకర్స్ క్లబ్ తెనాలి–2ను మిత్రులతో కలిసి ప్రారంభించారు. ప్రతి నెలా వైద్యులతో ఆరోగ్య సలహాలను ఇప్పిస్తూ, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఏటా తన సొంత రూ.50 వేలతో కేఎస్ఎం హైస్కూలు, ఎన్‌సీఆర్‌ఎం హైస్కూలు విద్యార్థులకు ప్రోత్సాహకాలు, పుస్తకాలు, ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందజేస్తూ వచ్చారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ తెలిపారు. వీరి కుమారుడు వీరమాసునేని శ్రీనివాస్ అమెరికాలోని యునైటెడ్ స్టేట్స్ జిప్సమ్ కార్పొరేషన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా చేస్తున్నారు. వాకర్స్ క్లబ్ తెనాలి–2 సభ్యులు ఆనందరావు, భుజంగరావు, బుచ్చిబాబు, భాస్కరరావు, సూరిబాబు తదితరులు మనోహర్ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియలు సోమవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని అగ్ని మాపక శాఖ అధికారి వై.సాంబశివరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సినిమా థియేటర్లు, బస్టాండ్ సెంటరు, రైల్వే స్టేషన్ సెంటరులో ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు కర పత్రాలను పంపిణీ చేసి, వివరించారు. గృహ విద్యుత్ వైరింగ్‌లో లూజ్ కాంటాక్ట్‌లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో చెత్తను తగలబెట్టే సమయంలో నీటిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎం.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, డి.పాండురెడ్డి, ఎన్.నాగరాజు, పి.హరిబాబు, కేవీ సాయికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

23న విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం



విగ్రహాల ఆవిష్కరణకు చురుగ్గా పనులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు బౌద్ధ స్తూపం సమీపంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్యోద్యమ నాయకులు, జాతీయ సమైక్యతా స్ఫూర్తి ప్రదాతల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం ఈ నెల 23న ఉదయం 8:15 గంటలకు నిర్వహించనున్నట్లు వివేకానంద విగ్రహ సాధన కమిటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామ దేవత దండిపార్వతీ అమ్మవారి వద్ద ఆహ్వాన పత్రికలు ఉంచి పూజలు నిర్వహించి, ఆవిష్కరించారు.

వేసవిని వీడని మంచు తెరలు



భట్టిప్రోలు: మండు వేసవిలో.. పొగ మంచు తెరలు ఇంకా వీడటం లేదు. పగటి వేళ భానుడు భగ భగమంటున్నా.. నిప్పుల కొలిమి నెలవు మే మాసం సమీపిస్తున్నా.. వాతావరణంలో నెలకొన్న మార్పులతో అర్ధ రాత్రి నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. శనివారం ఉదయం 8 గంటల వరకు కూడా మంచు తెరలు పల్లెలను వీడటం లేదు. దీంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మే నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

16న అష్టావధానం

రేపల్లె: పట్టణంలోని శ్రీ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16న ఆదివారం సాయంత్రం 6.30గంటలకు అష్టావధానం సాహిత్య ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆలయ సింగిల్ ట్రస్టీ గద్దం రాధాకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ, సాహితీ వాచస్పతి మొవ్వా వృషాద్రిపతి పర్యవేక్షణలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని తెలిపారు.